# మార్పుకొండలు మనుష్పు...

ఎ. సువర్ణ



**ఆకాశం ఆనందంతో భూమాతను వజ్రాల హారాలతో అలంకరిస్తున్నట్లుగా తెల్లటి ధారలు భువి మీదికి జాలువారుతున్నయ్యి.**

జోరున కురుస్తున్న ఆ వానలో తడుసు కుంటూ వెళ్లి జానికమ్మ అన్నం ముద్ద గోడ మీద పెట్టి రావడం, ఆ అన్నం ముద్దను రెండు కాకులు వచ్చి తినడం కారిన్ కిటికీలోంచి కళ్లు పెద్దవిగా చేసుకుని ఆశ్చర్యంగా చూస్తోంది.

కారిన్ అమెరికన్ యువతి. దక్షిణ భారతీయ సాంప్రదాయాల మీద రీసెర్చి చేసే విద్యార్థిని. ప్రత్యక్షంగా చూసి తెలుసుకుని థీసిస్ రాయాలని భారత దేశం వచ్చింది... మొదట్లో తెలుగువారి సాంప్రదాయాలు ఆచారాలు తెలుసుకోవాలని అమెరికన్ అంబేసీలో పని చేస్తున్న రామేశ్వర శాస్త్రి దగ్గర కొచ్చింది.

కారిన్‌ని తమ సొంత ఊరైన అంతర్వేదికి వెళ్లి తమ ఇంట ఉండి థీసిస్ రాయమని పంపించారు. గోదావరి సముద్రంలో కలిసే చోటుకి వెళ్లి సముద్రం గోదావరిని తనలో కలుపుకునే అద్భుత దృశ్యాన్ని చూస్తూ కాసేపు కూర్చుని వచ్చేది కారిన్.

శాస్త్రిగారి కుమార్తె కౌముదంటే కారిన్‌కి ప్రాణం. తమ్ముడు వేణు, తల్లి జానికమ్మంటే వెర్రి అభిమానం. రాజోలులో కాలేజీలో చదువుకునే కౌముదికి పాశ్చాత్యులన్నా పాశ్చాత్య నాగరకతన్నా వెర్రి వ్యామోహం. కారిన్ తమింటికి వచ్చి ఉండడం తన అదృష్టంగా భావించింది కౌముది.

సాంప్రదాయాలు పాటించే వారింట తనకి ఆతిధ్యం దొరకడం తన అదృష్టంగా భావించింది కారిన్.

"ఆంటీ... ఆంటీ..." అన్నం పెట్టి లోపలి కెడుతున్న జానికమ్మని పిలిచింది కారిన్.

"ఏమిటమ్మా కారీ..." అని జానికమ్మ అడిగింది.

తనని ఆమె అట్లా ముద్దుగా "కారీ" అని పిలవడం కారిన్‌కి ఎంతో నచ్చింది.

"ఎండా వాన అని చూడకుండా రోజు ఎందుకాంటీ అన్నం ముద్ద గోడమీద పెట్టి "కా... కా...కా..." అని కాకులను పిలుస్తారు...?" అని అడిగింది కారిన్.

కారిన్ ఆ ఇంట్లోని ప్రతీ వస్తువుని ఆశ్చర్యంగా చూస్తుంది. శాస్త్రిగారు సంధ్య వార్చే రాగి పళ్లెం పంచపాత్ర ఉద్ధరిణీ చూసి అది ఏమిటి, సంధ్యావందనం ఎందుకు చేస్తారని ఆయనని అడుగుతుంది.

దేముడి గదిలో ఉన్న సీతారామ పట్టాభిషేకం ఫోటో, రామలింగ ప్రతిష్ఠ సాలిగ్రామాలు- ఇట్లా ఉన్న అందరి దేవత పేర్లు వరస వరసగా అడిగి వాళ్ల కథలను తెలుసుకుంది.

తులసి కోట, ప్రదక్షిణాలు, గడపలకి రాసే పసుపు, కుంకాలు, ద్వారాలకి కట్టే మామిడాకు తోరణాలు ఇట్లా ఒకటేమిటి ఎన్నోఎన్నెన్నో ఆచారాలు, పూజా పునస్కారాలను గురించి తెలుసుకుంది కారిన్.

జానికమ్మ రోజూ విస్తట్లో అన్నం పెట్టుకుని ముందు ముద్ద నెయ్యివేసి కలిపి విస్తరి ముందు పెట్టడం, భోజనం అంతా అయాక ఆ ముద్ద తీసికెళ్లి గోడమీద పెట్టి కాకిని పిలవడం చూస్తున్న కారిన్ అంత వానలో కూడా తడుసుకుంటూ వెళ్లి అన్నం ముద్ద పెట్టి రావడం ఆశ్చర్యం కలిగించి కారణం అడిగింది జానికమ్మని.

అప్పుడక్కడికి వచ్చిన కౌముది "నేను చెప్తా విను కారీ..." అన్నది.

"మా అమ్మ చదువుకున్న ఆచారవంతురాలు... అన్ని పాత సాంప్రదాయాలను పాటిస్తుంది... ఎప్పుడో మా అమ్మమ్మ, నాయనమ్మ ఆచారాలను మానలేక ఇంకా ఇప్పటికీ ఆచరిస్తోంది..." అని తల్లిని ఎగతాళి చేసింది కారిన్... తల్లి చేసే ప్రతీ సాంప్రదాయం కూతురికి నచ్చదు... తల్లి తనని పెట్టే

కట్టుదిట్టాలన్నా నచ్చవు. కాలేజీ అయిపోగానే తిన్నగా ఇంటికి రాకపోతే తల్లి చేసే రభస అంతా ఇంతా కాదు.

"నేను ఇవన్నీ సాంప్రదాయాలనో పెద్దలు చేశారు కనక నేనూ చెయ్యాలనో చెయ్యడం లేదు కారీ గుడ్డెద్దు చేలో పడ్డట్లు...

"కొన్ని జీవుల ఆకలి తీర్చడమే నా ముఖ్య ధ్యేయం... నాలుగు రోజుల నుంచీ విడవ కుండా కురిసే వానలో కాకులన్నీ ఎట్లా తడిసి పోయినయ్యో చూడు... ఈ వానలో వాటికెక్కడా ఆహారం దొరకదు.. అలవాటు ప్రకారం నేను పెట్టే ముద్ద కోసం ఎట్లా కూర్చున్నయ్యో చూశావా. అందుకే ఇవ్వాళ కొంచెం ఎక్కువగా పట్టుకొచ్చి పెట్టాను" అని. జానికమ్మ అన్నట్లుగానే ఆమె పెట్టిన అన్నం ముద్దని నాలుగు కాకులు పంచుకు తింటున్నయ్యి.

"ఆంటీ రియల్లీ యూ ఆర్ గ్రేట్.. మీ హృదయం ఎంతో విశాలమైంది..."

"ఓ.. కారీ మరీ అంతగా నన్ను పొగడకు... నేనేం కొత్తగా చెయ్యడంలేదు. కాకులకి అన్నం పెట్టడం అనేది ఎన్నో తరాల నుంచీ వస్తున్నది. ఇందులో నా గొప్పతనం ఏమీ లేదు..." అన్న జానికమ్మ నిరాడంబరత్వానికి కారిన్ ముగ్ధ రాలైంది.

"ఏం కాదు ఆంటీ! మనుష్యుల మనస్సులలో జాలి ప్రేమ అనేది లేకపోతే ఇట్లా వానలో తడుసుకుంటూ వచ్చి కాకులకి అన్నం పెట్టలేరు ఆంటీ..." అని జానికమ్మని నోరారా పొగిడింది కారిన్.

"ఇదింకా చాలా బాగుంది. మా అమ్మ నిన్ను మార్చేసి నట్లున్నదే. అమ్మకే తాళం వేస్తున్నావు.. ఐ పిటీ యూ. కారీ..." అని కారిన్‌ని ఎగతాళి చేసింది కౌముది.

ఆరోజు అందరూ అన్నాలకి కూర్చున్నారు. "కౌమూ మామిడి పళ్లు చెక్కు తీసి ముక్కలు కొయ్యమ్మా..." అన్నది జానికమ్మ కూతురుతో.

"నే కోస్తాను ఆంటీ" అన్న కారిన్ బంగినిపల్లి మామిడి పళ్లు కడుక్కొచ్చి కత్తిపీట మీద కూర్చుని చెక్కు తీస్తోంది. తొక్కతోపాటు బొటన వేలు, చూపుడు వేలు చివర్లు కోసుకుంది.

"అమ్మా..." అంటూ కోసే మామిడి పండుని కిందకి వదిలేసింది.

"అయ్యో కారీ! అలవాటులేని పని చెయ్య వద్దంటున్నా వినిపించుకోకుండా చెక్కు తీసి వేళ్లను కోసుకున్నావు. చూడెట్లా నెత్తురు బొటబొటా కారుతోందో.." అన్న జానికమ్మ పమిటి కొంగు చింపి నీళ్లతో తడిపి నెత్తురు తుడిచి గాయానికి బాండ్ ఎయిడ్ వేసింది.

"ఏమిటి ఆంటీ మీరు మరీను... చిన్న గాయానికింత హడావిడి చేస్తారేమిటి..." అన్న కారిన్ అన్నం కలుపుకు తినలేక పోయింది.

జానికమ్మ గారింట్లో ఉన్నప్పటి నుంచీ కారిన్ ఫోర్కు నైఫ్, స్పూన్‌తో తినడం మానేసింది. వాళ్లతో పాటు పీట మీద కూర్చుని అరిటాకులో అన్నం పెట్టించుకుని పప్పు, ఆవకాయ కలుపుకుని నెయ్యి వేయించుకు ముద్దలు చేసుకు తినడం నేర్చుకుంది.

ఇప్పుడు వేళ్లకి గాయం అవడం వలన అన్నం కలుపుకోలేక పోతోంది కారిన్. అది చూసిన జానికమ్మ నే కలిపి పెడతాను అని అన్నం కలిపి ముద్దలు చేసి కారిన్ నోట్లో పెట్టింది.

ఆమె ప్రేమకి కారిన్ కంట్లో నీళ్లు వచ్చేసినయ్యి.

"ఏనాడు మా అమ్మ కూడా ఇట్లా నోట్లో ముద్దలు పెట్టలేదు" అన్నది కారిన్. ఒక్క జానికమ్మ మాత్రం కాదు... ఆ ఊరిలోని ప్రతి ఒక స్త్రీలోను ప్రేమనే చూసింది కారిన్.

"ఏం కాదమ్మా. మీదేశంలో ఎవరూ తలలో పూలు పెట్టుకోరుటగా... ఇంద మా దేశంలో ఉన్న న్నాళ్లు నాపేరు చెప్పి ఈ పూలు పెట్టుకో..." అని రోజూ వతనుగా పూలిచ్చే అమ్మి కారిన్‌కు అరమూర మల్లె దండ ఊరికే ఇచ్చేది.


ఇంకా అనేక కుటుంబాలలో చూసి భారతీ యులకు కుటుంబం మీదున్న పాశానికి అనురక్తికి ముగ్ధురాలైంది కారిన్... అతిథి అభ్యాగతులను ఆదరించి ఆతిథ్యం ఇవ్వడంలో వాళ్లకి వారే సాటి. వేరెవరూ సాటి రారు అనుకుంది.

కారిన్ భారతదేశం వచ్చిన పని అయి పోయింది. తన దేశానికి తిరిగి వెళ్లే ప్రయత్నాలలో ఉంది.

"కారీ! నువ్వు స్పాన్సర్ చేస్తే నేను అమెరికా వస్తాను. పాస్‌పోర్టు తీసుకున్నాను. మా ఇంట్లో ఉన్నందుకు ప్రతిఫలంగా నిన్ను నాకు స్పాన్సర్ చెయ్యాలనడం లేదు.

"నాకీ ఇంట్లోంచి ఈ దేశం నుంచి విముక్తి కావాలి..." అన్న కౌముదిని ఆశ్చర్యంగా చూసింది కారిన్.

**మాటాడుతున్నా**



"అరగంట అయింది ఫోను పట్టుకొని. "అలాగే, అలాగే" అన్న ఒక్క మాట తప్ప మరేమాటా అనడం లేదు. ఇంతకీ ఎవరితో నయ్యా నువ్వు మాటాడుతున్నది?"

"మా ఆవిడతోనండీ"

"ఆ !!!"

వి.వి. సీతారామ్ దాస్
(గుంటూరు)

జీన్స్‌పాంటు, బనీనుతో వచ్చిన కారిన్ అక్కడి కాటన్ చీరలు కట్టుకుంది. ఇంకా కొన్ని కొని సూట్‌కేసులో పెట్టుకుంది.

"ఎందుకు విడుదల కావాలనుకుంటున్నావు. నువ్విక్కడ జైల్లోనా ఉంటున్నావు..." అని ఆశ్చర్యంగా అడిగింది కారిన్.

"నాపాలిట జైలే ఇది..."

"ఆహా... ఇంత గొప్పదేశంలో పుట్టడానికెంతో పుణ్యం చేసుకున్నావు కౌమూ నువ్వు... అద్భుతంగా ప్రేమించే తల్లిదండ్రులు... ఇంతమంచి వాతా వరణంలో నీకు ఏం కష్టంగా ఉంది...?" అడిగింది కారిన్.

"ఏం కష్టమని మెల్లిగా అడుగులేస్తాం... పంజరంలో బంధించిన పక్షిలా ఉంది నా బతుకు. మూఢాచారాలు మూఢ నమ్మకాలు నాకు ఊపిరి సలపకుండా చేస్తున్నయ్యి..." విసుక్కుంది కౌముది.

'ఏమిటి నీ కుటుంబం నీకు ఖైదులా ఉందా..!'

"ఆ... అవును... మా అమ్మ ఓ జైలరులా ఉంది నా పాలిట..."

"అయ్యో... అయ్యో... ఆ మహామాతనా జైలరంటున్నావు. నీవన్నీ ఉత్త అపోహలు."

"అపోహలు కావే కారీ... పచ్చి నిజాలు.. ఎక్కడికీ బయటికెళ్లకూడదు. కాలేజీ, ఇల్లు ఈ రెండు కాదని ఇంకో చోటికి వెళ్లే కూడదు... ఎప్పుడైనా ఎక్కడికైనా వెడితే అన్న టైముకి ఖచ్చితంగా వచ్చెయ్యాలి. కాస్త లేటైతే అమ్మ చేసే హంగామా ఇంతా అంతా కాదు.

"ఓరోజు కాలేజీ అబ్బాయిలతో కాబరే డ్యాన్సుకెళ్లి వచ్చానని అమ్మ పెట్టిన చివాట్లకి మొహం అంతా వాచిపోయింది... ఛీ...ఛీ... నేనెవడినో లేచి పోయి మానభంగం చేసుకొచ్చినట్లు మాట్లాడింది.

"పిల్లకి బుద్ధి వచ్చేందుకైనా ఎవడితోనైనా వెళ్లిపోవాలనుంది. ఉత్త సాంప్రదాయాలు, పెళ్లి పేరంటం, సీమంతం, పురుడు తప్ప వీళ్లకి ఇంకేం తెలియవు...

"నువ్వేమో మా దేశం కుటుంబం ఆచారాలు గొప్పవంటూ పొగుడుతావు..."

కౌముది మాట్లాడినదంతా మౌనంగా విన్నది కారిన్... ప్రవాహంలా సాగిపోతున్న కౌముది వాగ్ధోరణికి అడ్డు తగలలేదు కారిన్.

కారిన్ మాట్లాడక పోవడం గమనించిన కౌముది మాట్లాడ్డం ఆపేసింది. కాసేపు అక్కడ మౌనం రాజ్యం ఏలింది.

"మాట్లాడవేం కారీ..." కౌముది అడిగింది.

'కౌమూ నే చెప్పేది నువ్వు నమ్ముతావా...?'

"ఓ.. ష్యూర్... ష్యూర్ చెప్పు ఏమిటది."

"నన్ను నువ్వు మిస్ అని అనుకుంటున్నావు కదూ...?"

"నేను అనుకోవటం ఏమిటి.. నువ్వు మిస్‌వి, మా తెలుగులో చెప్పాలంటే కుమారివి..." అన్నది

కౌముది.

"అదే కాదంటున్నాను. నేను మిస్‌గా ఉండగానే మిసెస్ అయి పోయాను....?" అన్న కారిన్‌ని ఆశ్చర్యంగా చూస్తూ "వాట్ యూ ఆర్ మారీడ్...' అని అడిగింది కౌముది.

"నో... మారీడ్ కాదు...!"

"మరి?"

"నేను కొంతకాలం నా బోయ్ ఫ్రెండ్ డేవిడ్‌తో ఉన్నాను. పెళ్లి చేసుకోలేదు. అంతే కాదు నేనో బిడ్డకి తల్లిని కూడా..."

కౌముదికి షాకు కొట్టినట్లయింది.

మాటలు కరెంట్ షాకులా ఉంటయ్యాని అప్పుడే తెలిసింది కౌముదికి.

"ఇది నిజమా కారీ...?"

"ముమ్మాటికి నిజం... పదమూడేళ్ల వయస్సులో బోయ్ ఫ్రెండ్‌తో స్నేహం చేశాను. పధ్నాలుగో ఏట తల్లినైనాను. శారీరకంగా తల్లినైనా మానసికంగా తల్లిని కాగలిగే పరిపక్వత నాలో రాలేదు. బిడ్డ భారం అనిపించింది. డేవిడ్ కూడా తండ్రి భారాన్ని మొయ్య కలిగేంతగా ఎదగలేదు. తల్లినైన నన్ను వదిలేసి వెళ్లిపోయాడు.

"తల్లిదండ్రులకి బరువైన బిడ్డ అనాధ శరణాలయం పాలైంది."

కన్నీళ్ల మధ్య కారిన్ తన దీనగాధని వివరించింది.

"మాదేశంలో పిల్లల్ని అద్భుతంగా పెంచినా వాళ్లకి ఎక్కువగా విచ్చలవిడి తనం ఇస్తారు... కట్టుదిట్టాలలో పెంచాలనుకోరు తల్లిదండ్రులు... తమ స్వేచ్ఛకి అడ్డువస్తే సహించరు పిల్లలు.

"అందుకనే నా పిల్లలు నీ పిల్లలు మనపిల్లలు కలిసి ఆడుకుంటున్నారనే సామెత పుట్టింది. మీ అమ్మనాన్నలకి మల్లే కుటుంబం గుడిగా తలుస్తుకునే పవిత్రమైన తల్లిదండ్రులు మా దేశంలో లేరు... అందరి మాదిరిగానే మా అమ్మ... నా సవితి తండ్రివల్ల నేను నిజమైన ప్రేమను పొందలేక వాళ్లని వదిలేసి వచ్చాను..." అన్న కారిన్ రెండు చేతుల్లో మొహం దాచుకుని కుళ్లి కుళ్లి ఏడిచింది. కళ్లు తుడుచుకు మళ్లీ చెబుతోంది కారిన్.

"కౌమూ! మీ అమ్మ నిన్ను కట్టుబాట్లలో ఉంచటం నీ మీద నమ్మకం లేక కాదు.. నీ ఈ వయస్సులో మారే నీ మనస్తత్వం... ఆ మనసు చేసే ఆర్భాటం, అమ్మాయిల అమాయకత్వాన్ని అలుసుగా తీసుకుని అమ్మాయిల్ని తమ కోరికలకి ఆహుతి తీసుకునే అబ్బాయిలను మనస్సులో ఉంచుకునే మీ అమ్మ నీకీ కట్టుబాటు విధించింది.

"వయస్సులో చెలరేగే కోరికలనే ప్రేమ అనుకుని అపార్థం చేసుకునే అపరిపక్వం అయిన మనస్సు... మనం మన ఇష్టం వచ్చినట్లు జీవించే హక్కు మనకున్నా మరోజీవిని ఈ ప్రపంచంలోకి తీసుకొచ్చి బాధలు పెట్టే హక్కు మనకి లేదు.

"నేను నా సుఖానికి మాత్రమే విలువ ఇచ్చాను. నేనేమిటి- మా అమ్మా అంతే. ఆల్‌మోస్ట్ మా దేశంలోని ఆడవాళ్లందరూ అంతే... వాళ్లు చూపించిన దోవలోనే నేనూ వెళ్లాను. కన్యగా ఉండగానే తల్లినైనాను. నా బిడ్డకి తల్లి ప్రేమ లేకుండా అన్యాయం చేశాను.

"మాదేశంలో బాల నేరస్థులు, నాలా పెళ్లికాని తల్లులుండడానికి కారణం మాకున్న సెక్సు స్వాతంత్రమే. అందుకు మేము చెల్లించే ఖరీదుకు విలువే లేదు. ఎన్నో సంవత్సరాలు భార్యాభర్తలు కలిసి ఉండి కన్న పిల్లలకి పరిపూర్ణమైన ప్రేమను పంచి ఇచ్చే తల్లిదండ్రులు మాదేశంలో అపురూపం... భారతదేశంలో స్త్రీలను దేవతలుగా పూజిస్తారు" అన్నది కారిన్.

"అదేం లేదే కారీ. అదంతా ఉత్త నటన. ఒక పక్క దేవతలా పూజిస్తూనే మగవాళ్లు వాళ్లని పెట్టే బాధలు అన్నీ ఇన్నీ అని చెప్పలేము....."


కౌముదిని పూర్తి చెయ్యనివ్వలేదు కారిన్. మధ్యలోనే అందుకుంది.

"మీకు స్వాతంత్రం లేదంటావు. మగాళ్లు చేసే తప్పులన్నీ ఆడవాళ్లని చెయ్యనిస్తేనే నిజమైన స్వతంత్రం అంటావా? స్త్రీ శరీర ధర్మం అందుకు ఒప్పుకోదు.

"స్త్రీలు ధృఢమైన మనస్సు కలిగిన వారై ఉండాలి. చదువులోను సంపాదించడంలోనూ మగాళ్లతో సమానంగా ఉండాలి ఆడవాళ్లు. అదే ఆడవాళ్లకి నిజమైన స్వతంత్రం.

"అర్థరాత్రి అపరాత్రి అని చూడకుండా ఇష్టం వచ్చినట్లు ఉండడానికి ఇల్లు లాడ్జి కాదు. కోవెల. కోవెల తలుపులు సరిగ్గా టైముకి మూసుకుంటయ్యి. అవి మళ్లీ పూజా వేళకే తెరుచుకుంటయ్యి.

"ఇల్లంటే శరీరాలు, ఆత్మలతో కట్టిన దేవాలయాలు.




"నిన్న నేను నిద్రలో నడిచినపుడు చాలా అలసట కలిగింది డాక్టర్!"

"ఎందుకని?"

"నిద్రలో లేచి నడవకుండా నన్ను మా ఆవిడ మంచానికి వేసి కట్టేసింది. దాంతో నేను మంచాన్నే ఈడ్చుకుంటూ నడవాల్సి వచ్చింది."

వెంకట్ (అడవిపూడి)

"దేవో దేవాలయం అన్నారు.. తల్లి పిల్లలను రక్షించడంలో తప్పేముంది కౌముదీ.

"మాతృత్వం ఒక వరం... దాన్ని మేము అర్థం చేసుకోలేదు మీరు చేసుకున్నంతగా. అదొక యాక్సిడెంట్ అనుకున్నాము. మీ అమ్మగారు ఎప్పుడూ అన్నట్లు ఆడది దీపారాధనలోని దీపం వంటిది. అది గోరంత దీపం అయినా కొండంత వెలుగునిస్తుందనేది సెంట్ పర్సెంట్ కరెక్ట్.

"కానీ ఆ దీపంలో వేడి లేదనుకోకు. అవసరం అవుతే అది దావానలంలా మారి అడవుల్నే దహించెయ్యగలదు. ఇదేనమ్మా కౌమూ స్త్రీత్వం అంటే..

"నేను చెయ్యి కోసుకున్నప్పుడు నాకు అన్నం కలిపి ముద్దలు నోట్లో పెట్టి తినిపించింది. నేనెవరినని? నా నుంచి ఏమి ఆశించి నా మీద అంత ప్రేమ చూపించింది మీ అమ్మ. ఆరు నెలల కొకసారి రక్తదానం చేస్తోంది. చీమలకి పంచదార పెడుతోంది. కాకులకి అన్నం పెడుతోంది. వా... సూపర్బ్... మీ మదర్ గొప్పతనాన్ని నేనేమని వర్ణించను- షీ ఈజ్ రియల్లీ గ్రేట్.

"మనం మన కోసం జీవించడంలో గొప్పతనం లేదు కౌమూ. అందులో స్వారస్యం లేదు. బోరు కొడుతుంది. మదర్ థెరీసా చూడు. ఇంత వయస్సు వచ్చినా ఇంకా ఎట్లా మానవ సేవ చేస్తున్నారోగమనించావా?

మనం జీవితాఖరు రోజులలో వెనక్కి తిరిగి చూసుకుంటే ఏం కనిపించదు. అంతా శూన్యం. ఒంటరిగా నిలబడి పశ్చాత్తాప పడతాము. అన్న కారిన్ మనస్సంతా భావావేశంతో నిండి పోయింది.

"మా దేశం వెళ్లగానే నేను చేసే మొదటి పనేమిటో తెలుసునా కముదీ..." చిరునవ్వుతో అడిగిన కారిన్ మనస్సు స్థిమిత పడిందనుకుంది కౌముది.

"ఏం చేస్తావు... నువ్వు రాసిన థీసిస్ సబ్‌మిట్ చేసి డాక్టరేట్ తీసుకుంటావు. అంతకంటే ఇంకేం చేస్తావు." అన్నది కౌముది.

"యూ ఆర్ రాంగ్..." అన్న కారిన్‌ని ఏం చేస్తావన్నట్లుగా చూసింది కౌముది.

"నా బిడ్డను అనాధ శరణాలయం నుంచి తీసుకొచ్చి పరిపూర్ణమైన తల్లి ప్రేమతో పెంచుతాను..." అన్న కారిన్ మాటలకి కౌముది పులకించి పోయింది.

హూ ఇద్దరిద్దరే! కారిన్ భారతీయ సాంప్రదాయాలను గౌరవించి తమదేశం స్త్రీలు అట్లా ఉండాలనుకుంటే, భారతదేశంలో పుట్టిన కౌముది అమెరికన్ నాగరికతను మెచ్చుకుని అక్కడలా స్వేచ్ఛాస్వతంత్రాలను కోరుకుంటున్నది... మొదటి నుంచీ వీళ్లద్దరి సంభాషణ విన్న జానికమ్మ "దూరపు కొండలు నునుపు"అని అనుకుంది.

⊙